ఇంటర్వ్యూ



సుమిత్ కుమార్.. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జిల్లా కలెక్టరుగా నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వరుస సమీక్షలు, తనిఖీలు, పర్యటనలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం జిల్లా మీద ఓ అవగాహనకు వచ్చారు. ఇక్కడి అవసరాలు తెలుసుకున్నారు. వాటిని తీర్చేందుకు పటిష్ఠ ప్రణాళికలతో ముందుకు పోతున్నారు. ఈ క్రమంలో ప్రాధాన్యాంశాలు.. జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు.. ప్రజల సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న చర్యలపై కలెక్టరు సుమిత్ కుమార్ 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ప్రజా సమస్యల్ని తీర్చడమే ప్రధాన లక్ష్యం

- పరిశ్రమల స్థాపనకు జిల్లా అనుకూలం
- కేంద్ర పథకాల్ని సద్వినియోగం చేసుకుంటాం
- ప్రభుత్వ శాఖల్లో అవినీతిని తగ్గించాలి
- సీఎం జిల్లా కావడంతో మరింత బాధ్యత
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ సుమిత్‌కుమార్

నేరుగా కలిసి సమస్యలు చెప్పుకోవచ్చు

సాధారణంగా ప్రజలు తమ సమస్యల్ని కింది స్థాయి అధికారులకంటే పైస్థాయి వారికి చెబితే త్వరగా పరిష్కారమవుతాయని భావిస్తారు. అందుకే కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్ డే రోజు పెద్దఎత్తున అర్జీలు వస్తుంటాయి. ఇక నుంచి అలా కాదు. సామాన్య ప్రజలైనా సరే ఎవరి సిఫార్సు లేకుండానే ఏ సమయంలోనైనా నన్ను కలవచ్చు. సమస్యలు చెప్పుకోవచ్చు. ప్రజలకు నేరుగా అందుబాటులో ఉండి వారి సమస్యలు తీర్చడమే నా మొదటి ప్రాధాన్యత.

రైతులకు వీలైనంత ఎక్కువగా మేలు చేసేలా..

పశుసంవర్ధక, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖలు నా దృష్టిలో ముఖ్యమైనవి. ఈ మూడు సెక్టార్ల మీద నేను ఎక్కువ ఫోకస్ పెడతా. వీటిలో కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎక్కువగా ఉంటాయి. ఆ పథకాల కింద నిధులు మనకు వచ్చేలా దృష్టిపెట్టి సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు వీలైనంత ఎక్కువ మేలు కలిగేలా చేస్తాను. గతంలో పనిచేసిన కలెక్టర్ రావత్ సార్ కూడా ఈ రంగాలపై ఎక్కువగా దృష్టి పెట్టారు.

ఆ శాఖల్లో అవినీతి లేకుండా చేస్తా

ప్రజలతో నిత్యం పనులుండే రెవెన్యూ, రిజిస్ట్రేషన్, పోలీసు శాఖలతో పాటు ఉద్యోగులకు సంబంధమున్న ట్రెజరీలో కూడా అవినీతిని తగ్గించాలి. ఇదే ప్రధాన లక్ష్యంగా వచ్చిన రోజు నుంచీ పనిచేస్తున్నా. ఈ దిశగా పకడ్బందీ ప్రణాళిక రచిస్తున్నాం.

కొత్త సంస్థలకోసం ప్రణాళిక

జిల్లాకు ఎలాంటి కొత్త ఇన్‌స్టిట్యూషన్స్ తీసుకుని రావచ్చని ఆలోచిస్తున్నాం. దానికి అనుగుణంగా ప్లానింగ్ చేస్తున్నాం. ఇప్పటికే కొన్ని వివిధ ఏర్పాటు దశల్లో ఉన్నాయి. చిత్తూరు, కుప్పం ప్రాంతాల్లో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ముందడుగు పడింది. ఈ మధ్యే కేంద్ర బృందం స్థలాల్ని పరిశీలించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాలు ప్రారంభం కానున్నాయి.

నా మీద అదనపు బాధ్యత

ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలే నావి కూడా. మైక్రో ఇరిగేషన్, హార్టికల్చర్, హౌసింగ్, విద్య, వైద్యం, అంగన్వాడీ వంటి అంశాలకు ప్రాధాన్యమిచ్చి, రెగ్యులర్‌గా సమీక్షిస్తున్నా. సీఎం సొంత జిల్లాలో పని చేస్తున్న కాబట్టి నాపైన మరింత బాధ్యత పెరిగింది. ప్రజలకు అనుకూలంగా పని చేసి వారి సమస్యల్ని పరిష్కరించాలి. అప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. మరో 15 రోజుల్లో జిల్లాకు కొత్త అధికారుల బృందం సెట్ అవుతుంది. అప్పుడు సమష్టిగా పనిచేసుకుంటాం.

కేంద్ర పథకాల్ని సద్వినియోగం చేసుకోవచ్చు

ఉపాధి హామీ పథకంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నా. ఆ నిధులతో రోడ్లు, డ్రైనేజీలు, పశువులకు షెడ్లు, శ్మశానాల అభివృద్ధి వంటి పనుల్ని చేపట్టేందుకు ప్రణాళికలు చేస్తున్నాం. పీఎం ఎంప్లాయిమెంట్ గ్రామీణ్ ప్రోగ్రామ్, స్టాండప్ ఇండియా, ముద్ర ఇండియా వంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని కొత్తగా ఎంటర్‌ప్రైన్యూయర్స్‌ను ప్రోత్సహించవచ్చు. ఈ అంశంపై నెలకోసారి సమీక్షిస్తాను.

మూడు ప్రాంతాలు పరిశ్రమలకు అనుకూలం

కుప్పం, పలమనేరు, నగరి ప్రాంతాలు పరిశ్రమల స్థాపనకు అనువైనవి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించి, ఉపాధి అవకాశాల్ని మెరుగుపరడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. నగరి ప్రాంతంలో 1500 ఎకరాలు పరిశ్రమల స్థాపనకు సిద్ధంగా ఉన్నాయి. ఇటీవల వెళ్లి ఆ భూముల్ని పరిశీలించా. కుప్పంలో కూడా పరిశ్రమలు వచ్చేలా కృషి చేస్తున్నాం. నగరి, కుప్పం ప్రాంతాల్లో మూడు నాలుగు నెలల్లోనే ప్రగతి కనిపించనుంది. ఇప్పటికే పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ క్లస్టర్లు ఉన్నాయి. అక్కడ మరిన్ని పరిశ్రమలు వచ్చేలా చూస్తాం. జిల్లాకు మ్యానుఫాక్చరింగ్, ఆటో మొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి ఇండస్ట్రీలు జిల్లాకు అవసరమని గుర్తించాం. తదనుగుణంగా ఆయా పరిశ్రమల్ని తెచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం.

పల్లెలకు 'స్వాతంత్ర్యం'



● జెండా పండగ కోసం రూ.73.5 లక్షలు

ఐదువేల జనాభా ఉన్న పంచాయతీలకు రూ.వంద.. అంతకుమించితే 250 రూపాయలు. 34 ఏళ్లుగా జెండా పండుగ కోసం ఈ మొత్తాన్ని మాత్రమే పంచాయతీలు సాధారణ నిధుల నుంచి వాడుకునేందుకు అనుమతి ఉంది. ఈ మొత్తాలు త్రివర్ణ పతాకాలు కొనేందుకూ సరిపోని పరిస్థితి. దీంతో మొక్కుబడిగా పంద్రాగస్టు వేడుకలు నిర్వహించి.. సర్పంచులు తమ సొంత డబ్బుతో చాక్లెట్లు తెప్పించి పిల్లలకు పంచేవారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చాక ఏ రాష్ట్రప్రభుత్వం ఇవ్వని రీతిలో నిధుల ఖర్చుకు ఆమోదం తెలిపింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో పంచాయతీలకు స్వాతంత్ర్య వేడుకలు జరుపుకొనేందుకు వ్యయాన్ని పెంచారు. ఐదువేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ. 10వేలు, అంతకుమించితే రూ.25 వేలను సాధారణ నిధుల నుంచి వాడుకోవడానికి అనుమతి ఇచ్చారు. జిల్లాలో 5వేల లోపు జనాభా కలిగిన మైనర్ పంచాయతీలు 670, అంతకు మించి జనాభా ఉన్నవి 26 చొప్పున 696 పంచాయతీలు ఉన్నాయి. ఈ లెక్కన మైనర్ పంచాయతీలకు రూ.67 లక్షలు, మేజర్ పంచాయతీలకు రూ.6.50 లక్షలు వెరసి జిల్లాలో రూ.73.50 లక్షల ఖర్చుకు ఆమోదం లభించింది.పంచాయతీల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో రాజ్యాంగ విలువలు,స్థానిక సంస్థల పాలన వంటి అంశాలపై వ్యాసరచన, క్విజ్, ఆటల పోటీలు, స్వాతంత్ర్య సమరయోధులు, పారిశుధ్య కార్మికులను ఆ రోజు సత్కరిస్తారు. ఈ నిధుల పెంపుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు జిల్లా పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

- చిత్తూరు కలెక్టరేట్



వరసిద్ధుడి ఆలయంలో రద్దీ

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 10: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి దర్శనానికి ఉదయం నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి విచ్చేశారు. క్యూలన్నీ పూర్తిగా నిండిపోయాయి. దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. క్యూలలో భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

కూటమిలోనూ కదలని పీఠాలు

● వైసీపీ పాలనలో ఏకపక్షంగా పనిచేసినా జిల్లా వదలని అధికారులు

జగన్‌రెడ్డి అధికారంలో ఉన్న కాలంలో జిల్లాలో అధికారులు వైసీపీ కార్యకర్తల్లా పనిచేశారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఐఏఎస్‌ల నుంచి పంచాయతీ కార్యదర్శి దాకా వైసీపీ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే విధులు నిర్వహించారు. ప్రజలనూ, కూటమి పార్టీలకు చెందినవారినీ వీరు ముప్పుతిప్పలు పెట్టారు. ఈ ఐదేళ్లూ జిల్లా పాలన ఏకపక్షంగా సాగిందనే విమర్శలు వచ్చాయి. ఈ వివక్ష, దౌర్జన్యాల ఫలితంగానే ఎన్నికల్లో వైసీపీని ప్రజలు చిత్తుగా ఓడించేశారు. ప్రభుత్వం మారింది కనుక ఇక జిల్లాలో వైసీపీకి అంటకాగిన అధికారులపై చర్యలుంటాయనీ, వీరిని ఈ స్థానాల నుంచి కదిలిస్తారనీ అందరూ ఆశించారు. అయితే విచిత్రంగా కూటమి ప్రభుత్వంలోనూ కొందరు జిల్లాలోనే తిష్టవేసుకుని ఉన్నారు. కొందరిని షోకాజ్‌లతో సరిపెట్టారు. వైసీపీ పాలనలో తమను ఇబ్బందులు పెట్టిన అధికారులూ, ఉద్యోగులూ దర్జాగా జిల్లాలోనే తిరుగుతూ ఉండడం చూసి కూటమి కార్యకర్తలు నోరెళ్లబెడుతున్నారు.

- డీఈవోగా కొనసాగుతున్న దేవరాజు వైసీపీ కోసం పనిచేసినట్లు తీవ్ర ఆరోపణలున్నాయి. కడప జిల్లాకు చెందిన ఈయన మాజీ సీఎం జగన్ మేనమామ రవీంద్రనాథ్‌రెడ్డి అండతో చిత్తూరులో పోస్టింగ్ వేసుకున్నట్లు చెబుతారు. డీఈవో తీరుకు వ్యతిరేకంగా కార్యాలయం ఎదుట ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున ధర్నా కూడా చేశారు. ఎమ్మెల్యేలను కూడా ఆయన మతించడంలేదనే విమర్శలున్నాయి. అయినా ఆయన యథాస్థానంలో దర్జాగా విధులు నిర్వహిస్తున్నారు.
- విద్యాశాఖకు అనుబంధమైన సమగ్రశిక్ష జిల్లా కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి వైసీపీకి అనుకూలంగా పనిచేశారని అందరూ చెబుతారు. అయినా ఐదేళ్లుగా ఒకే పోస్టులో ఆయన కొనసాగుతున్నారు.
- పెద్దిరెడ్డి అండతో పోస్టింగ్ తెచ్చుకున్న డీఆర్‌డీఏ పీడీ తులసి కూడా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యేల మాట ప్రకారమే ఆమె నడచుకునేవారన్న ప్రచారం ఉంది. ఆమె కూడా యథాస్థానంలో కొనసాగుతున్నారు.
- చిత్తూరు తహసీల్దార్‌గా పనిచేసిన పార్వతి, కిరణ్ వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. విలువైన భూముల సమాచారం విజయానందరెడ్డికి తెలియజేసి పట్టా చేసుకునేలా కిరణ్ సహకరించినట్లు ఆరోపణలున్నాయి. సీకేపల్లి వద్ద ఉన్న మైదా ఫ్యాక్టరీ వద్దనున్న చెరువు గట్టును కూడా పట్టా చేసిచ్చినట్లు విమర్శలొచ్చాయి. ఈ ఆరోపణలున్న పార్వతి వి.కోటలో, కిరణ్ విజయపురంలో తహసీల్దార్లుగా నియమితులవడం విశేషం.
- పెద్దపంజాణి మండలంలో రెండో ఎంఈవో తులసీరామ్ వైసీపీ కార్యకర్తగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. మండల సమావేశాల్లో సైతం మాజీ సీఎం జగన్‌ను పొగుడుతూ ప్రసంగించేవారు. ఆయన ఇంకా మండలంలోనే కొనసాగుతున్నారు.

పుంగనూరు తీరే వేరు

పుంగనూరు నియోజకవర్గంలో అయితే అన్ని శాఖల అధికారులూ పెద్దిరెడ్డి ఆదేశాలనే ప్రభుత్వ ఉత్తర్వుల్లా అమలు చేశారు. పుంగనూరులో గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన సీతారామ్ కొన్నాళ్ల కిందట ఆర్డీవో కార్యాలయ ఏవోగా బదిలీ అయ్యారు. పుంగనూరు, చౌడేపల్లెలో పనిచేసిన తహసీల్దార్ మాధవరాజు ప్రస్తుతం బైరెడ్డిపల్లెలో ఉన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు సోమల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేశారు. ఇప్పుడు సెలవులో ఉన్నారు. పుంగనూరులో తహసీల్దార్‌గా చేసిన వెంకట్రాయులు రెండేళ్ల కిందట బదిలీ అయ్యారు. వీరితో పాటు పెద్దిరెడ్డికి ముఖ్య అనుచరుడిగా పనిచేసిన పుంగనూరు మున్సిపల్ కమిషనర్ లోకేశ్వర్ వర్మ తిరుపతి మున్సిపల్ ఆర్వోగా బదిలీ అయ్యారు. పెద్దిరెడ్డి అండతో అప్పట్లో ఆయన కుప్పం, మదనపల్లె, బి.కొత్తకోటలో కూడా ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించారు.అలాగే పుంగనూరు విద్యుత్తుశాఖ ఏడీఈ రవికుమార్‌రెడ్డి పెద్దిరెడ్డి ప్రియ శిష్యుడిగా ఆ శాఖలో చక్రం తిప్పారు.పుంగనూరు మున్సిపల్ మెప్మా సీవో మధుసూదన్‌రెడ్డి, అన్ని మండలాల వెలుగు ఏపీఎంలు పెద్దిరెడ్డికి అనుకూలంగా ఉంటూ ఎన్నికల్లో ప్రత్యక్ష, పరోక్షంగా వైసీపీ కోసం పనిచేశారు. వీరంతా కొత్త ప్రభుత్వంలోనూ ధీమాగా కొనసాగుతున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

జీడీనెల్లూరులో ఇలా..

జీడీనెల్లూరు తహసీల్దార్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ అశోక్ వైసీపీకి అనుకూలంగా ఉంటూ ఆన్‌లైన్‌లో రైతుల భూముల్ని ఇష్టానుసారం మార్చేసినట్లు ఆరోపణలున్నాయి. అయినా అక్కడే ఇంకా కొనసాగుతున్నారు. వెలుగు ఏపీఎం చిరంజీవి, రెండో ఎంఈవో గుణశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గాయత్రి వైసీపీ ముద్ర వేసుకుని మరీ పనిచేశారు. మళ్లీ మంచి పోస్టింగ్ కోసం టీడీపీ నేతల్ని ఆశ్రయిస్తున్నారు. పెనుమూరు మండలంలో రైతు వద్ద లంచం తీసుకునే వీడియో వైరల్ కావడంతో తహసీల్దార్ రమణికి డీటీగా డిమోషన్ ఇచ్చారు. హౌసింగ్ సూపర్‌వైజర్ కనకరాజు, ఇరిగేషన్ ఏఈ భాస్కర్‌రెడ్డి వైసీపీకి అనుకూలంగా పనిచేసినా కొనసాగుతూనే ఉన్నారు. ఎన్నికలకు ముందు మండలంలో సుదీర్ఘంగా పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులున్నారు. వీరిలో కలికిరి కార్యదర్శి లావణ్యకు నిధుల ఖర్చుపై బిల్లులు సక్రమంగా లేవని డీపీవో షోకాజ్ నోటీసు ఇచ్చారు.

కుప్పంలో కొందరిపై చర్యలు

కుప్పం నియోజకవర్గంలో ఏకపక్షంగా పనిచేసిన వివిధ శాఖల అధికారుల్లో కొందరిపై చర్యలు తీసుకున్నారు. ఎన్నికల సమయంలో ఆర్డీవోగా పనిచేసిన శ్రీనివాసులును బదిలీ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా హోల్డ్‌లో ఉంచారు. మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు ఓ మహిళను లైంగికంగా వేధించారనే కారణంతో బదిలీ అయ్యారు. ఈయనకు కూడా పోస్టింగ్ ఇవ్వకుండా హోల్డ్‌లో ఉంచారు. కుప్పం సబ్‌రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి సస్పెండ్ అయ్యారు. శాంతిపురం మండలంలో సర్వేయర్‌గా పనిచేసే సద్దాం వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. సీఎం చంద్రబాబు ఇంటి నిర్మాణ స్థలాన్ని సర్వే చేసేందుకూ లంచం తీసుకున్నారని కూటమి ప్రభుత్వం వచ్చాక ఇతన్ని సస్పెండ్ చేశారు. రెవెన్యూ సమస్యలు సృష్టించిన ఆర్ఐ మధు మాత్రం ఇంకా ఇక్కడే పనిచేస్తున్నారు.



16 మంది ఎస్‌ఐల బదిలీ

చిత్తూరు, ఆగస్టు 10: జిల్లాలో 16 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు. బంగారుపాళ్యం మల్లికార్జునను చిత్తూరు ఎస్‌బీకి బదిలీ చేశారు. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం పరుశురాముడును బైరెడ్డిపల్లెకు, బైరెడ్డిపల్లె కృష్ణయ్యను వీఆర్‌కు పంపారు. తిరుపతి జిల్లా ఆర్‌సీపురం చిరంజీవిని తవణంపల్లెకు, అదే జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఐగా ఉన్న ధరణీంద్రను కాణిపాకానికి, కాణిపాకం రామ్మోహన్‌ను గుడిపాలకు, తిరుపతి జిల్లా తిరుచానూరు వెంకటసుబ్బయ్యను వెదురుకుప్పానికి, ఐరాల రమేష్‌బాబును చిత్తూరు తాలూకాకు, చిత్తూరు తాలూకా ఉమామహేశ్వర్‌రెడ్డిని వీఆర్‌కు పంపారు. మహిళా పీఎస్ నాగసౌజన్యను చిత్తూరు రూరల్‌కు, అక్కడ పనిచేసే వెంకటసుబ్బమ్మను వీఆర్‌కు బదిలీ చేశారు. డీసీఆర్‌బీలో పనిచేసే స్వర్ణతేజను పలమనేరు అర్బన్‌కు, విజయపురం జయప్పను బంగారుపాళ్యంకు, తిరుపతి సీఐడీ ఎస్‌ఐగా ఉన్న రాజ్‌కుమార్‌ను కార్వేటినగరానికి, వీఆర్‌లో ఉన్న సుగుణను చిత్తూరు రెండో పట్టణ స్టేషన్‌కు, వీఆర్‌లో ఉన్న సురేంద్రబాబును పీసీఆర్‌కు బదిలీ చేశారు.

సత్య ప్రమాణానికి రండి

● రాజనాలబండకు పిలవగానే బంగారు కమ్మలు ప్రత్యక్షం

చౌడేపల్లె, ఆగస్టు10: 'సత్య ప్రమాణం చేయడానికి రాజనాల బండకు రండి' అంటూ కమ్మలు పోగొట్టుకున్న బాధితులు పిలవగానే నిందితుల్లో వణుకు మొదలైంది. రాత్రికి రాత్రే ఆ కమ్మలు, నగదు మూటకట్టి బాధితుడి ఆటోలో ఉంచి వెళ్లిపోయారు. రాజనాలబండ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ తెలిపిన ప్రకారం.. కర్ణాటకలోని కొత్తమనగలానికి బాలసుబ్రహ్మణ్యం ఆటో నడుపుకొంటున్నారు. బీరువాలో ఉంచిన అతడి భార్య చెవి కమ్మలు, మాటీలు నెల కిందట చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వారికి అడిగినా ప్రయోజనం లేకపోయింది. గ్రామపెద్దల సూచన మేరకు ఆలయ నిర్వాహకుల వద్ద అనుమతి తీసుకుని రాజనాల బండలో సత్య ప్రమాణానికి చుట్టు పక్కల ఇళ్లవారిని పిలిచారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి బంగారు కమ్మలు, రూ.20వేల నగదు గుడ్డలో మూటకట్టి గుర్తు తెలియని వ్యక్తులు తన ఆటోలో ఉంచినట్లు బాలసుబ్రహ్మణ్యం చెప్పారు. మాటీలకు బదులు, డబ్బులు ఆ మూటలో ఉన్నాయన్నారు. స్వామి మహిమతోనే నగలు వచ్చాయంటూ శనివారం రాజనాల బండ వద్ద పూజలు నిర్వహించారు.



బంగారు కమ్మలతో స్వామి వారికి పూజలు చేస్తున్న బాలసుబ్రహ్మణ్యం కుటుంబీకులు

ఇసుక రవాణా, లోడింగ్ ధరలిలా..!

కూటమి అధికారంలోకి వచ్చాక ఇసుక నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇందులో ఇసుక పూర్తిగా ఉచితం. అయితే, స్టాక్ పాయింట్ల వరకు ఇసుక రవాణా.. అక్కడ లోడింగ్‌కు మాత్రం డబ్బు చెల్లించాలి. జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ సుమిత్ కుమార్ దీనికి సంబంధించిన విధివిధానాలను ప్రకటించారు. ఆ ప్రకారం.. జిల్లాలోని దిగువమాసపల్లి, పాలూరు ఇసుక స్టాక్ యార్డుల నుంచి ట్రాక్టర్, టిప్పర్ల ద్వారా రవాణా చేసుకునే సౌకర్యం కల్పించింది. ఇసుక ఉచితం. అయితే, యార్డుల్లో ట్రాక్టర్‌లో 5 టన్నుల ఇసుక లోడ్ చేయడానికి రూ.775, టిప్పర్‌లో 10 టన్నుల ఇసుక లోడ్ చేయడానికి రూ.1550 ధర నిర్ణయించారు. దీనికి అదనంగా 10 కిలో మీటర్ల నుంచి 30 కిలో మీటర్ల దూరానికి రవణా చార్జీలనూ ప్రభుత్వం నిర్ణయించింది. ఇసుక, రవాణా చార్జీలు కలుపుకొని 10 కిలోమీటర్ల దూరానికి ట్రాక్టర్ ధర రూ.1975, టిప్పర్‌కు రూ.3150గా చెల్లించాలి. 10-15 కిలో మీటర్ల దూరానికి ట్రాక్టర్‌కు రూ.2175, టిప్పర్‌కు రూ.3450.. 15-20 కిలోమీటర్ల దూరానికి రూ.2375, రూ.3750 వంతున.. 20-25 కిలోమీటర్ల దూరానికి రూ.2575, రూ.4050 చొప్పున.. 25-30 కిలోమీటర్ల దూరానికి ట్రాక్టరు ఇసుకకు రూ.2775, టిప్పర్‌కు రూ.4350 చొప్పున ధర నిర్ణయించారు. ట్రాక్టర్, టిప్పర్ యజమానులు ఈ ధరల కంటే అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గనుల శాఖ అధికారులు హెచ్చరించారు.

- చిత్తూరు (సెంట్రల్)




SUNDAY FOCUS

లడ్డూ, చక్కెర పొంగలి, ఉప్పుపొంగలి, దద్దోజనం, క్షీరాన్నం.. ఇలా తిరుమల శ్రీనివాసుడికి సమర్పించే నైవేద్యాలు అనగానే పవిత్ర భావంతోపాటూ నోరూరుతుంది. ఘుమఘుమలు ముక్కులను తాకుతాయి. తిరుమల ప్రసాదాల రుచి ఇంకెక్కడా ఎందుకు రాదా అనే సందేహం కలుగుతుంది. అయితే కొన్నేళ్లుగా ప్రసాదాల రూపూ రుచీ మీద పెదవిరుపులు పెరిగాయి. 'అబ్బే.. అప్పుడున్న రుచి.. ఇప్పుడెక్కడిది?' అనే నిట్టూర్పులు వినిపిస్తున్నాయి. జగనన్న పాలనలో తిరుమల ప్రసాదాలు కూడా నాణ్యతలేకుండా పోయాయనే విమర్శలూ హోరెత్తాయి.

ఎందుకు ఇలా? ఏం జరిగింది?

ప్రసాదాలకు ముడి పదార్థాల వాడకంలో, దిట్టంలో మార్పులు జరిగాయి? నాణ్యమైన పదార్థాలు వాడడం లేదా? లడ్డూ నాణ్యతే కాదు, సైజూ తగ్గిపోయిందనీ, అన్నప్రసాదాలు తక్కువ వ్యవధిలోనే పాడైపోతున్నాయనీ భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే వున్నారు.


గతంలోని అన్నప్రసాదాలు




ఆర్గానిక్ ప్రసాదాలు

తిరుమల ప్రసాదాల రుచి ఎందుకు తగ్గింది?

- టీటీడీని కలవరపెడుతున్న భక్తుల అసంతృప్తి
- ఆర్గానిక్ ధాన్యం వాడకంపై పునఃసమీక్ష

శ్రీవారి లడ్డూప్రసాదానికి ఎంతటి ప్రాముఖ్యత ఉందో, ఆలయంలో వితరణ చేసే అన్నప్రసాదాలకూ అంతే ప్రాముఖ్యత ఉంటుంది. ప్రతినిత్యం త్రికార నైవేద్యం పేరుతో శ్రీవారికి రోజుకు మూడు పూటలా నైవేద్య సమర్పించడం ఆనవాయితీ. ఇందులో నైవేద్య సమర్పణ సమయాన్ని మొదటి గంట, రెండో గంట, మూడో గంటగా వ్యవహరిస్తారు. తొలి నివేదన ఉదయం 5.30కు, రెండో నివేదన ఉదయం 10 గంటలకు, రాత్రి నివేదన 7.30 గంటలకు సమర్పిస్తారు. వారపు సేవలను బట్టి నివేదన సమర్పణ సమయం మారుతుంటుంది. స్వామి నివేదించే ప్రసాదాల్లో ప్రధానంగా లడ్డూ, వడ, సీరా, దోశ, ప్రసాదాలతోపాటు చక్కెరపొంగళి, కదంబం, పులిహోర, దద్దోజనం, మిరియాల పొంగలి, సేకరాబాత్, మొలహోరా వంటి అన్నప్రసాదాలూ ఉంటాయి. వీటిని ఆలయంలోని బంగారువాకిలికి ఆగ్నేయదిశగా ఉన్న పోటులో శ్రీవైష్ణవులు పవిత్రంగా ఇప్పటికీ కట్టెల పొయ్యలపైనే తయారు చేస్తున్నారు. ప్రతి ప్రసాదాన్ని ఒక్కో గంగాళంలో తీసుకెళ్లి మూలవర్లకు నివేదించడం గమనార్హం.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కొవిడ్ తర్వాత భక్తులకు దూరమైన ప్రసాదాలు

కొవిడ్ తర్వాత తిరుమలలో స్వామికి సమర్పించే అన్నప్రసాదాల్లో తేడా మొదలైంది. రుచి తగ్గిపోవడంతోపాటూ, తయారు చేసే ప్రసాదాల పరిమాణం తగ్గిపోయింది. ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థం కాదు. గతంలో స్వామి దర్శనానికి వెళ్లిన ప్రతి ఒక్కరికీ బయటకు రాగానే చక్కెర పొంగలో, పులిహోరో, దద్దోజనమో దొన్నెలో పెట్టి చేతికిచ్చేవారు. ఇప్పుడు వీఐపీలకు తప్ప అన్నప్రసాదాలు అందడం లేదు. ఇందుకు కారణం - అన్నప్రసాదాల తయారీ బాగా తగ్గించేయడమే. గతంలో స్వామికి నివేదించేందుకు ప్రతిరోజు 29 గంగాళాల అన్నప్రసాదాలు తయారు చేసేవారు. శుక్రవారం అభిషేకం సందర్భంగా 40 గంగాళాలు సమర్పిస్తే, గురువారం తిరుప్పావై సేవకు 29 గంగాళాలకు అదనంగా మరో 40 గంగాళాల అన్నప్రసాదాలను స్వామికి సమర్పించేవారు. దర్శనానంతరం భక్తులకు పంచడానికి వీలుగా రోజూ మరో 60గంగాళాల ప్రసాదాలు చేసేవారు. ఇందువల్ల రోజూ 25-30 వేల మంది భక్తులకు అన్నప్రసాదాలు అందేవి.

ఇప్పుడు ఇలా...

కొవిడ్ సమయంలో భక్తులు ఉండరు కాబట్టి అదనపు ప్రసాదాల తయారీని తగ్గించి కేవలం స్వామికి మాత్రమే సమర్పిస్తూ వచ్చారు. ఆతర్వాత భక్తుల సంఖ్య నెమ్మదిగా పెరిగినప్పటికీ దీన్నే కొనసాగించేశారు. వాటి పరిమాణం కూడా దారుణంగా తగ్గించేశారు. పైగా ఆర్గానిక్ పదార్థాలతో తయారు చేసిన అన్నప్రసాదాలనే స్వామికి నివేదించడం మొదలుపెట్టారు. గోఆధారిత వ్యవసాయంతో పండించిన పంటలతోనే గోవిందునికి నైవేద్యం సమర్పించే విధానం 2022 అక్టోబరు నుంచి అమలు అవుతోంది. రోజుకు కేవలం 204 కిలోల దేశీయ బియ్యంతో చేసిన అన్నప్రసాదాలను మాత్రమే స్వామికి ప్రస్తుతం నివేదిస్తున్నారు. దీంతో ఇవి సాధారణ భక్తుల దాకా రావడం లేదు. అధికారులు, వీఐపీలకే సరిపోతున్నాయి.

రుచి తగ్గడానికి కారణాలేమిటి?

బహురూపి, నారాయణకామిని, రత్నచోళి, కాలాబట్, చింతలూరి సన్నం, చిట్టిముత్యాలు, ఎర్రబంగారం వంటి దేశీయ వరిబియ్యంతోనే అన్నప్రసాదాలను వండుతున్నారు. ఈ అన్నప్రసాదాల రుచిపై తీవ్రస్థాయిలో విమర్శలు ఉన్నాయి. మునుపటి అన్నప్రసాదాలతో పోల్చుకుని అందరూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పైగా త్వరగా పాడైపోతున్నాయి కూడా. నిజానికి సేంద్రియ పదార్థాలతో చేసిన వంటల రుచి భిన్నంగా ఉంటుంది. వీటిని వండే పద్ధతి కూడా మారుతుంది. ముడి బియ్యం వాడుతుంటే ఎక్కువ సేపు నానబెట్టడం వంటివి చేయాలి. సేంద్రియ ధాన్యాలతో రకరకాల వంటలు రుచిగా ఎలా చేయవచ్చో అనేక పుస్తకాలు కూడా విడుదలయ్యాయి. ప్రత్యేకంగా రెస్టారెంట్లే నడుస్తున్నాయి. వీటిని ఇష్టపడి మరీ తింటున్నారు. మరి టీటీడీ చేస్తున్న అన్నప్రసాదాలు మాత్రం ఎందుకు రుచిగా లేవన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వీఐపీల నుంచి కూడా విమర్శలు పెరగడంతో టీటీడీ అధికారులు పూర్వపు విధానమే అనుసరించాలా అనే చర్చ కూడా చేస్తున్నారు. సాధారణ సన్న బియ్యంతోనే అన్నప్రసాదాలు తయారు చేయాలా లేక గోఆధారిత ఉత్పత్తులతోనే కొనసాగించాలా అనే అంశంపై కొత్తగా పాలక పగ్గాలు చేపట్టిన అధికారులు పరిశీలిస్తున్నారు. ఇందుకుసంబంధించిన నిపుణుల సూచనలు కూడా కోరుతున్నారు. మునుపటిలా అందరికీ అందేలా అన్నప్రసాదాల తయారీ పరిమాణం కూడా పెంచాలని భక్తులు కోరుతున్నారు.

పుంగనూరులో అత్యధిక వర్షపాతం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 10: జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 19 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా పుంగనూరులో 75.4, అత్యల్పంగా పలమనేరులో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. రొంపిచెర్లలో 51.2, పులిచెర్లలో 47.2, వీకోట 40.4, చౌడేపల్లె 38.6, నగరి 36.2, పెద్ద పంజాణి 20.6, సోమల 14.6, గుడుపల్లె 12.2, నింద్ర 9.4, జీడీ నెల్లూరు 9.2, గుడిపాల 6.8, సదుం, కుప్పం 6.2, బైరెడ్డిపల్లె 5.2, శాంతిపురం 3.6, గంగవరం, తవణంపల్లెలో 3.4మి.మీ వర్షం కురిసింది.

రిజర్వేషన్ల పేరుతో చీలికలకు బీజేపీ కుట్ర

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

కుప్పం, ఆగస్టు 10: రిజర్వేషన్లను అడ్డు పెట్టుకుని కోర్టు తీర్పుల పేరుతో కులం, మతం ప్రాతిపదికగా దేశ ప్రజలను చీల్చడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ అనవసరమన్నారు. క్రీమీలేయర్ ప్రతిపాదన అన్యాయమన్నారు. కుప్పంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పుడు ఎస్సీలు, తర్వాత ఓబీసీలు, ఇతర కులాల్లో రిజర్వేషన్లను తారుమారు చేయడం ద్వారా ప్రజలను చీల్చాలన్న బీజేపీ ప్రయత్నం దేశ సమైక్యతకు విఘాతం కలిగిస్తుందన్నారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలనను పూర్తిగా భ్రష్టు పట్టించారని విమర్శించారు. ఎస్సీ కార్పొరేషన్‌ను మూసివేసి దళిత ద్రోహిగా వ్యవహరించారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవంటూ ఇప్పుడు జగన్ విమర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు ఈవిషయంలో చక్కగా పనిచేస్తున్నారన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ను తిరిగి ప్రారంభించాలని ముఖ్యమంత్రిని కోరారు. కుప్పం, తిరుపతి అభివృద్ధి గురించి ఆలోచించాలన్నారు. కుప్పంలో ఇప్పటికీ వలసలు ఆగలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రులు వైఎస్సార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, జగన్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం మీద ఎంత ఖర్చు చేశారో ప్రజలకు లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు.

వాహనం ఢీకొని దుప్పి మృతి



గంగవరం, ఆగస్టు 10: పలమనేరు - బెంగళూరు రహదారిలో మామడుగు వద్ద శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి చెందింది. కొన్ని రోజులుగా మామడుగు పరిసర ప్రాంతాల్లోని అటవీ ప్రాంతం నుంచి తరచూ దుప్పులు రోడ్లపైకి వస్తూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. గత నెలలో ఈ ప్రాంతంలోనే ఒక దుప్పి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. వెంటనే మృతి చెందింది. తాజాగా శనివారం కూడా మామడుగు వద్ద ఇదేతరహాలో మరో దుప్పి చనిపోయింది. డ్రయివర్ వాహనం ఆపకుండా వెళ్లిపోయారు. తీవ్రగాయాలై రోడ్డుపై విలవిలలాడుతున్న దుప్పిని పరిసర ప్రజలు గుర్తించారు. వెంటనే వెళ్లి రోడ్డుపక్కకు తీసుకొచ్చారు. నోటిలో నీరు పోసి రక్షించడానికి ప్రయత్నించారు. అప్పటికే ఆ మూగజీవి మృతిచెందింది. అటవీశాఖ అధికారులకు స్థానికులు ఈవిషయం తెలియజేశారు. దుప్పుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

19 నాటుబాంబుల స్వాధీనం : నిందితుడి అరెస్టు


నాటుబాంబులతో భాస్కర్

గుడిపాల,ఆగస్టు10: మండలంలోని చిత్తపార అటవీ ప్రాంతంలో శనివారం గుడిపాల పోలీసులు 19 నాటుబాంబులు స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన భాస్కర్ అడవి పందులను వేటాడేందుకు తయారు చేసినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు.

గిరిజన అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ

తిరుపతి(విద్య),ఆగస్టు10:గిరిజన అభ్యర్థులకు ఉచితంగా భోజన వసతితో పాటు డీఎస్సీ శిక్షణను ఉచితంగా అందించనున్నట్టు తిరుపతి జిల్లా గిరిజన సంక్షేమ, సాధికరిత అధికారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన వంద మంది గిరిజన అభ్యర్థులకు ఈ అవకాశం ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు ఈనెల 16వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు తిరుపతి కలెక్టరేట్‌లోని బీ బ్లాక్, 5వ అంతస్తులోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం లేదా సీనియర్ అసిస్టెంట్ పి.శీనయ్య (సెల్ నెంబరు: 94935 24121)ను సంప్రదించవచ్చని సూచించారు.

'పీఎం సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి


చిత్తూరులోని సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్ఈ సురేంద్రన్

చిత్తూరు రూరల్, ఆగస్టు 10: పీఎం సూర్యఘర్ (సోలార్) పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్రనాయుడు సూచించారు. శనివారం చిత్తూరు పర్యటనకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయన్నారు. వీటి ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల వరకు సబ్సిడీ ఇస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 1871 మంది దరఖాస్తు చేసుకోగా 1764 నిర్మాణ దశలో, 30 పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ప్రతి ఒక్కరు పీఎం సూర్యఘర్ పథకాన్ని వాడుకొని విద్యుత్ ఆదా చేయాలన్నారు. చిత్తూరులో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం రూ.1.28 కోట్లతో గిరింపేట నుంచి దొడ్డిపల్లి వరకు నూతన లైన్లు వేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో తిరుపతికి దీటుగా చిత్తూరులో విద్యుత్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే 215 సబ్‌స్టేషన్లలో మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదుల పుస్తకాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారులు, రైతులు ఎవరైనా ఈ బుక్ ద్వారా తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చని సూచించారు. ప్రతి బుధవారం నిర్వహించే విద్యుత్ గ్రీవెన్స్ డేకు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి తమిళనాడు సరిహద్దుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నట్లు తెలిపారు. వీటి స్థానంలో కొత్తవి ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, డీఈ శేషాద్రి, ఏఈలు పాల్గొన్నారు.

టీటీడీ ఇంజనీరింగ్ ఉద్యోగులకు స్టేట్ విజిలెన్స్ నోటీసులు!

తిరుమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా, అవసరానికి మించి నిధులు కేటాయించారంటూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే పలువురు అధికారులు, ఉద్యోగులకు స్టేట్ విజిలెన్స్ నోటీసులు జారీ చేసినట్టు తెలుస్తోంది. రాజకీయ లబ్ధికోసం గత వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారం ఇంజనీరింగ్ పనులకు వందల కోట్ల రూపాయలు కేటాయించిందని, అవసరం లేకున్నా రోడ్లు వేశారని, కమీషన్ల కోసం శ్రీవారికి చెందిన కోట్లాది రూపాయలు ఖర్చు చేశారంటూ తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈక్రమంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రత్యేకంగా స్టేట్ విజిలెన్స్ బృందాలను తిరుపతికి పంపింది. వారు సుమారు రెండు నెలల పాటు ఇంజనీరింగ్ విభాగం మాత్రమే కాకుండా పలు కీలకమైన విభాగాల్లోనూ సోదాలు చేశారు. ముఖ్యమైన పత్రాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులను విచారించారు. వారి వద్దనుంచి స్టేట్‌మెంట్లు కూడా రికార్డు చేశారు. స్వయంగా అన్నింటినీ పరిశీలించారు. ఈక్రమంలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసిన, చేస్తున్న దాదాపు 58 మంది అధికారులు, ఉద్యోగులకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ బోర్డు తీర్మానాలను ఎందుకు వ్యతిరేకించలేదంటూ నోటీసుల్లో పేర్కొన్నట్టు తెలిసింది. త్వరలో కొందరిపై చట్టపరమైన చర్యలకు సిఫార్సు చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే మిగిలిన విభాగాల అధికారులు, ఉద్యోగులకూ త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం.

బలి తీసుకున్న బతుకు బండి!

ట్రాక్టరు కింద నిద్రించిన డ్రైవర్

చూసుకోకుండా వాహనాన్ని అతడిపై ఎక్కించేసిన యజమాని

తీవ్రగాయాలతో యువకుడి మృతి


గుణశేఖర్(ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, ఆగస్టు 10: తల్లిదండ్రులు లేకపోయినా ట్రాక్టర్ డ్రైవర్‌గా ఆ యువకుడు జీవనం సాగించేవాడు. బతుకునిచ్చిన బండి కింద అలసటతో ఆదమరచి నిద్రించాడు. దీన్ని యజమాని చూసుకోకుండా ట్రాక్టర్‌ను నడపడంతో బతుకుబండే ఆ యువకుడిని బలి తీసుకున్న విషాద సంఘటన తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం రౌతుసూరమాల వద్ద జరిగింది. బుచ్చినాయుడుకండ్రిగ మండలం భవానీశంకరాపురానికి చెందిన గుణశేఖర్(20)కు బాల్యంలోనే తల్లిదండ్రులు మృతి చెందారు. దాంతో బంధువుల సంరక్షణలో పెరిగాడు. పెద్దవాడయ్యాక తొట్టంబేడు మండలం రౌతుసూరమాల వద్ద గ్రావెల్ ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం వేళ విరామ సమయంలో ట్రాక్టర్ కింద నీడలో సేద తీరేవాడు. శనివారం కూడా తన ట్రాక్టర్ ట్రాలీ కింది నిద్రించాడు. దీన్ని గమనించని ట్రాక్టర్ యజమాని ఆ వాహనాన్ని నడపడంతో దానికింద ఉన్న గుణశేఖర్ పైకి ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తిరుపతిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. గుణశేఖర్‌కు సమీప బంధువు బత్తెయ్య తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోలీసులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక న్యాయమూర్తి


న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 10: కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేష్‌నాయక్ శనివారం కాణిపాక వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మధుసూదన్‌రావు, లత, శాంతవ్వ పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

మాదక ద్రవ్యాల వాడకం ప్రాణాంతకం



మాట్లాడుతున్న క్రిషిత్,తదితరులు

కుప్పం, ఆగస్టు 10: మాదక ద్రవ్యాల వాడకం ప్రాణాంతకమని డాక్టర్ క్రిషిత్ అన్నారు. కుప్పం డిగ్రీ కళాశాలలో శనివారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న క్రిషిత్ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల కలిగే వ్యక్తిగత, కుటుబ, సామాజిక నష్టాలను వివరించారు. వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో యువత పాత్ర ముఖ్యమైనదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో రేడియోగ్రాఫర్ ప్రవీణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, యాంటీ డ్రగ్స్ టుబాకో సెల్ కో-ఆర్డినేటర్ బాలాజీ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో శాశ్వత కట్టడాలు చేపడితే చర్యలు



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఫణిరాజశయన

కల్లూరు, ఆగస్టు 10: నిబంధనలు అతిక్రమించి ఆలయ భూముల్లో శాశ్వత కట్టడాలు చేపడితే చర్యలు తప్పవని ఆ శాఖ తిరుపతి డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఫణిరాజశయన హెచ్చరించారు. మర్రికుంటవారిపల్లి సమీపాన దుర్గాంబ ఆలయ వ్యవసాయ భూములు కల్లూరు, దేవళంపేట పంచాయతీల్లో ఉన్నాయి. ఆలయ భూములను శనివారం ఆయన పరిశీలించారు. ఇందులో శాశ్వత కట్టడాలు చేపడుతున్నట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. నిర్మాణాలు చేపట్టరాదన్నారు. ధూప దీప నైవేద్యం సమర్పించేకుటుంబీకులు ఈ భూముల సాగుద్వారా వచ్చే ఫలసాయాన్ని మాత్రమే పొందాలని స్పష్టంచేశారు.

చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన



బుట్టల గురించి వివరిస్తున్న అధికారులు

రామకుప్పం, ఆగస్టు 10: సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శనివారం చెత్త సేకరణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఇంటింటా చెత్త సేకరణ,నిర్వహణపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో పాటు పట్టణ ప్రజలకు డీపీఆర్‌సీ ప్రతినిధులు శివయ్య, మహేష్‌లు వివరించారు. తడిచెత్త, పొడిచెత్త బుట్టలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఓపీఆర్‌డీ రాధాకృష్ణ, పంచాయతీ డిజిటల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుభాష రక్షణకు కృషి చేయాలని వినతి



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న తులసీనాథం నాయుడు

గంగవరం, ఆగస్టు 10 తెలుగుబాష రక్షణకు సహకరించాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు తులసీనాథంనాయుడు, పుష్పలు శనివారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులుకు వినతిపత్రం అందించారు. గుంటూరు విజ్ఞాన్ యూనివర్శిటీలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఎంపిని వీరు కలిసి, తెలుగుబాష రక్షణకు రాష్ట్ర, దేశ స్థాయిలో కృషిచేయాలని విన్నవించారు. తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. సమితి సభ్యులుమురళి, సురేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సుజల తాగునీటి కార్డులను పంపిణీ



కార్డులు పంపిణీ చేస్తున్న బాబునాయుడు

గుడుపల్లె, ఆగస్టు 10: కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ సుజల మంచినీటి రీఛార్జి కార్డులను మండల టీడీపీ అధ్యక్షుడు బాబునాయుడు శనివారం పార్టీ కార్యలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు కార్డులను ఉపయోగించుకొనిట్యాంకుల వద్ద మంచి నీటిని వినియోగించుకోవాలన్నారు. పలు గ్రామాల్లో ట్యాంకులను త్వరలో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భానుమూర్తి, రామమూర్తి, వెంకటేశు, జగదీష్, గుడుపల్లె సుజల ఇన్‌చార్జి వెంకటేశు, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయుడికి ప్రత్యేక పూజలు

గుడుపల్లె, ఆగస్టు 10: కనమనపల్లెలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం మూల విగ్రహానికి విశేష అలంకరణ చేసి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సీతారామ, లక్ష్మణ, ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. మహిళలు హారతులు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి



విత్తనాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు,ఆగస్టు10: ప్రభుత్వ సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకులు సుబ్రమణ్యం నాయుడు, సుదర్శన్‌నాయుడు, మదన్ మోహన్‌రెడ్డి, సరస్వతి కోరారు. మతుకువారిపల్లి సచివాలయంలో శనివారం సబ్సిడీ ధరలతో మేత మొక్కజొన్నలు, మేత జొన్నలు పంపిణీచేశారు. వారు మాట్లాడుతూ 5కేజీల మేత మొక్కజొన్నలు రూ.85, 5కేజీల మేత జొన్నలు రూ.115గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఏహెచ్ఏ పురుషోత్తం, రైతులు పాల్గొన్నారు.

యూటీఎఫ్‌తో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం



నినాదాలు చేస్తున్న నాయకులు

రొంపిచెర్ల, ఆగస్టు10: ఉపాధ్యాయ, ఉద్యోగుల,సామాజిక సమస్యలు పరిష్కారం యూటీఎఫ్‌తోనే సాధ్యమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఈశ్వర్‌మహేంద్ర అన్నారు. తమ సంఘం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రొంపిచెర్లలో సంబరాలు జరుపుకొన్నారు. జిల్లా యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడు రాధాక్రిష్ణ జెండా అవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు మాట్లాడారు.

ప్రత్యేక అలంకరణలో కల్యాణ వెంకటరమణ

పుంగనూరు, ఆగస్టు10: స్థానిక కోనేటి వద్ద కల్యాణ వెంకటరమణస్వామి శ్రావణ శనివారం సందర్భంగా భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. తొలి శ్రావణ శనివారం కావడంతో భక్తులు ఉపవాసాలతో దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు



బహుమతులు అందజేస్తున్న సుధాకరయ్య

పుంగనూరు రూరల్, ఆగస్టు10: ఆదాయాన్ని కల్పిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. డీజిల్ ఆదా చేసిన డ్రైవర్లు బిఎం. బాషా,ఫిరోజ్‌బాషా, కండక్టర్లు కృష్ణ, పార్వతమ్మలకు ఆయన శనివారం బహుమతులు అందజేశారు.

ఘనంగా అభయాంజనేయస్వామి వార్షిక వేడుక

గంగవరం, ఆగస్టు10: గుండుగల్లులో అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షిక వేడుకలు శనివారం నిర్వహించారు. స్వామివారిని అలంకరించి, ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. గొల్లైలదొడ్డిలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరయ్యారు. టీడీపి మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడు, ప్రతాప్‌రెడ్డి, అలకుప్పం రాజన్న, హరి, వెంకటేష్‌నాయుడు, గిరిధర్‌గుప్త పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై నేడు సమావేశం

పుంగనూరు, ఆగస్టు10: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణపై ఆదివారం చౌడేపల్లె మండల కేంద్రంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు మాలమహానాడు జిల్లా అధికార ప్రతినిధి మల్లెల మోహన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ పేరుతో రాజకీయాలు చేస్తున్నాయన్నారు. విద్యార్థులు, మేదావులు, మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు దేశభక్తి పోటీలు

పుంగనూరు రూరల్, ఆగస్టు10: విద్యార్థులల్లో దేశభక్తిని పెంపొందించేందుకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు మదర్‌థెరిసా చారిటబుల్‌ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈ నెల 18న జ్ఞానాంబిక ఇంగ్లీషు మీడియం పాఠశాల ఆవరణలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నామన్నారు. మొదటి బహుమతి రూ.5001, ద్వితీయ బహుమతి రూ.3001, తృతీయ బహుమతి రూ. 2001, నాలగవ బహుమతి రూ.1001 తోపాటు ప్రతి విద్యార్థికీ సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 998979472, 9030460050 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గుడుపల్లె ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీదేవి



గుడుపల్లె, ఆగస్టు 10: మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీదేవిని నియమిస్తూ జడ్పీసీఈవో గ్లోరియా ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం మండల కార్యలయంలో ఈమె బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల సమయంలో నెల్లూరు జిల్లా నుంచి గోపి వచ్చారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో ఆయన తిరిగి సొంత జిల్లా నెల్లూర్లుకు బదిలీపై వెళ్లిపోయారు.

కుప్పనపల్లెలో వ్యక్తి ఆత్మహత్య



బైరెడ్డిపల్లె, ఆగస్టు 10 : కుప్పనపల్లె గ్రామంలో జగదీష్ ఆచారి(45) అనే వ్యక్తి శనివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... జగదీష్ ఆచారికి భార్య నవనీత, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏడేళ్ల క్రితం భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో భార్య వి.కోటలోని పుట్టింటికి పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. అప్పటినుంచి ఒంటరిగా ఉంటున్న ఇతడికి కొంతకాలంగా మతిస్థిమితం లేదు. ఈనేపథ్యంలో శనివారం తన ఇంట్లోనే ఉరివేసుకుని చనిపోవడాన్ని స్థానికులు గుర్తించారు. వారి సమాచారంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో శేఖర్‌బాబు తెలిపారు.

ఘనంగా శ్రావణ శనివార పూజలు



కడపనత్తంలో నలగుండ్రాయస్వామికి పూజలు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 10 : స్థానిక శేషాద్రిస్వామి, పట్నపల్లె కల్యాణ వెంకన్న, కడపనత్తం నలగుండ్రాయ స్వామి ఆలయాల్లో శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రావణమాసం కావడంతో ఆలయాలవద్ద భక్తుల సందడి నెలకొంది.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



జ్ఞాపిక అందిస్తున్న సూపరింటెండెంట్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 10: కాణిపాక ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి శనివారం కర్నూలుకు చెందిన హరిషోత్తమరెడ్డి రూ.1,11,116 విరాళంగా అందించారు. దాతను ఆలయ సూపరింటెండెంట్ వాసు ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

బంగారుపాళ్యం, ఆగస్టు 10: అక్రమంగా కర్ణాటక, ఆంధ్రా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని సదకుప్పం గ్రామానికి చెందిన మునిరత్నం, ధనుంజయ నాయుడు శనివారం కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వేపనపల్లికి చెందిన సుజాతను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద మద్యాన్ని స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంతర్ జిల్లాల షూటింగ్ బాల్ పోటీల ప్రారంభం

వి.కోటలో పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వి.కోట, ఆగస్టు 10: గ్రామీణ స్థాయి నుంచి ప్రతి క్రీడాకారుడు ఒలంపిక్ స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి ఆకాంక్షించారు. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అంతర్ జిల్లాల షూటింగ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. 16 జిల్లాలకు చెందిన క్రీడాకారుల నుంచి ఎమ్మెల్యే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరనాథరెడ్డి మాట్లాడుతూ వి.కోటలో రూ.2 కోట్లతో మినీ స్టేడియం నిర్మించ తలపెడ్తితే గత వైసీపీ ప్రభుత్వం పునాదులకే పరిమితం చేసిందన్నారు. గ్రామాలలోనే ఆణిముత్యాలాంటి క్రీడాకారులను గుర్తించి ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళేందుకు పీఈటీలు కృషి చేయాలన్నారు.. క్రీడాకారులకు కిరణ్ ఫౌండేషన్ భోజన వసతి సమకూర్చింది. కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల షూటింగ్ బాల్ అసోసియేషన్ ఛైర్మెన్ నరేష్‌బాబు, జిల్లా ఛైర్మన్ మహేష్, అధ్యక్షులు పవన్, కార్యదర్శి వేణుగోపాల్‌తో పాటు ఏఎంజీ మాజీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, రాంబాబు, చౌడప్ప, ధీరజ్, జిల్లా కార్యదర్శి శబరీష్ పాల్గొన్నారు.

జ్వరాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

పుంగనూరు రూరల్. ఆగస్టు10: జ్వరాల సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన స్థానిక గిరిజన వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత పాటించాలన్నారు. వేడి నీటిని తాగాలని సూచించారు. జ్వరాలు సోకిన వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట వైద్య సిబ్బంది హరిప్రసాద్ రెడ్డి, దేవప్రసాద్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

సోమల, ఆగస్టు 10: కందూరు హైస్కూల్‌లో 1983-84 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. గురువులు జి. వెంకటస్వామి, జి. చంద్రమ్మ, బి పాపిరెడ్డి, విజయకుమారిలను సన్మానించారు. కార్యక్రమంలో వాసు, నాగరాజ, నౌషాద్, అన్వర్, నాగేంద్ర, సురేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మునిరత్నం

శాంతిపురం, ఆగస్టు 10: క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చునని కుప్పం టీడీపీ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం గుండిశెట్టిపల్లెలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్ బాబు, గోపినాథ్, సత్యేద్రశేఖర్, డాక్టర్ వెంకటేష్, విజయరామిరెడ్డి, ఉదయ్‌కుమార్, వెంకటేష్, రాజేంద్ర, అనుసూయ, సుగుణమ్మ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీల ప్రారంభం



పోటీలను తిలకిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గంగవరం,ఆగస్టు10: స్థానిక టీకేసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి, జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడుతూ పోటీలు మూడురోజుల పాటు నిర్వహించి 12న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. డాక్టర్ ఆకుల గజేంద్రప్రసాద్, షేక్ బాబు, బాలాజి, సుబ్రమణ్యం, మంజునాథ్, గుర్రప్పతోపాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు హరిబాబు

చౌడేపల్లె, ఆగస్టు10: ఈనెల 13న చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల పార్టీ అధ్యక్షులు హరిబాబు కోరారు. శనివారం ఆయన ఎమ్మార్పీఎస్ నాయకులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. మందకృష్ణ మాదిగ పట్టుదలతో ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. ఢిల్లీ నుంచి ఆయన 13న హైదారాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో వెళ్లి స్వాగతం పలకాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందు, ఆంజప్ప,హరిబాబు, నరసింహులు, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: చలో హైదరాబాద్ జయప్రదం చేయాలని నియోజక వర్గం ఎంఎస్‌పీ ఇన్‌చార్జి బి.నరసింహులు కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద రామనాధం, నాయకులు వరగాని ప్రభాకర్, బాలాజీ, శవికుమార్, రమేష్ పాల్గొన్నారు.

శరవేగంగా హనుమదీశ్వరస్వామి ఆలయ నిర్మాణం



చౌడేపల్లె, ఆగస్టు10: పంచముఖ హనుమదీశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని బోయకొండ మాజీ ఛైర్మన్ ఎస్‌కే వెంకటరమణరెడ్డి పేర్కొన్నారు. ఏకొత్తకోట వద్ద సొంత నిధులు రూ.10 కోట్ల వ్యయంతో పంచముఖ హనుమదీశ్వరస్వామి, షిర్డిసాయిబాబా, కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాలు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. హైదారాబాద్‌కు చెందిన ఆర్కిటెక్ నిపుణులతో కలసి శనివారం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. టీడీపీ నాయకులు జల్లి మనోహర్, మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ పాల్గొన్నారు.

వెంకటేశ్వరుడికి విశేష అలంకరణ



రామకుప్పం, ఆగస్టు 10: పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలోని వేంకటేశ్వరాలయంలో శనివారం శ్రావణ శనివార పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీవారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని అర్చనలు చేయించారు. సుబ్రహ్మణ్యస్వామి, పద్మావతి, శనీశ్వరస్వామి ఆలయాలు కూడా కిటకిటలాడాయి. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ అన్నప్రసాదాలను పంపిణీ చేసింది.

పాలేటమ్మవారికి పొంగళ్లతో పూజలు

సోమల, ఆగస్టు 10: నెల్లిమంద పాలేటమ్మవారి ఆలయంలో జాతర నేపథ్యంలో శనివారం అమ్మవారికి భక్తులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. ఈనెల 6 నుంచి ఉత్సవమూర్తి, పోతురాజులు వివిధ గ్రామాల్లో గ్రామోత్సవాలు జరుపుకుని ఆలయానికి చేరుకున్నారు. ఈక్రమంలోనే సిద్ధపూజలు చేశారు. ఆదివారం రాత్రి వివిధ గ్రామాల నుంచి పుష్ప పల్లకీలు చేరుకుంటాయి. మొక్కులు చెల్లించుకోనున్నారు. ధర్మకర్త నరసింహులు, ఎస్ఐ శివశంకర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి బదిలీ

కల్లూరు, ఆగస్టు 10: స్థానిక ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా పెనగలూరుకు బదిలీ చేశారు. కర్నూలు రేంజ్ ఐజీ ఈమేరకు ఉత్తర్వులిచ్చారు. ఈయన 2022 సెప్టెంబర్ 17న ఇక్కడ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. సుమారు రెండేళ్ల పాటు ఎస్ఐగా పనిచేశారు.

విరబూసిన బ్రహ్మ కమలాలు



గుడుపల్లె, ఆగస్టు 10: యామిగానిపల్లెలోని మండల వన్నెకుల క్షత్రియ అధ్యక్షులు శ్రీనివాసులు ఇంటి పెరటిలో శుక్రవారం రాత్రి బ్రహ్మ కమలాలు విరబూశాయి. శ్రావణ శుక్రవారం విరబూయడంతో మహిళంతా వచ్చి పూజలు చేశారు. గ్రామస్థులు ఈ పూలను ఆసక్తిగా తిలకించారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు

సోమల, ఆగస్టు 10: పట్టణంలోని పలు ట్రాన్స్‌ఫార్మర్లకు శనివారం ట్రాన్స్‌కో ఏఈ మహేంద్ర రెడ్డి సిబ్బందితో కలసి మరమ్మతులు చేపట్టారు. పలు చోట్ల విద్యుత్ లైన్లు సరిదిద్దారు. ఎల్ఐ చిన్నప్పరెడ్డి, లైన్‌మెన్ జ్యోతి రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధదేవ్ మృతి వామపక్షాలకు తీరని లోటు



నివాళులర్పిస్తున్న నాయకులు

గంగవరం, ఆగస్టు10: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి వామపక్షాల ఉద్యమానికి తీరని లోటు అని సీపీఎం నాయకులు గిరిధర్ గుప్త పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బద్దదేవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఓబులరాజు, కేవీపీఎస్ ఈశ్వర్, ఐద్వా భువనేశ్వరి, సంజయ్ శర్మ, ధనమ్మ, లక్ష్మయ్యలతోపాటు పలువురు పాల్గొన్నారు.

చినుకు పడితే ఈమార్గాల్లో రాకపోకలకు ఇబ్బందే..

సోమల, ఆగస్టు 10: సోమల నుంచి నంజంపేట రోడ్డు మార్గంలో చినుకు పడితే ప్రయాణం గగనంగా మారుతోంది. దెబ్బ తిన్న రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. సోమల నంచి నంజంపేట, చిన్నఉప్పరపల్లె, ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె పంచాయతీ గ్రామాల వాహనదారులు ఈ మార్గంలోనే ప్రయాణం సాగిస్తారు. వీరంతా ఇబ్బందులు పడుతున్నారు. ఈమార్గంలోనే బెంగళూరు, చిత్తూరు, బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. సోమల సచివాలయం వద్ద దెబ్బతిన్న రోడ్డుపై గుంతలు ఉండి పంచాయతీ అధికారులు మట్టిని తోలారు. గుంతల్లో వర్షం నీరు చేరడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు దుస్థితిపై టీడీపీ మండల నాయకులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లారు. తాత్కాలిక మరమ్మతులకు రూ. 9 లక్షలు మంజూరు చేశారు. పనులు కార్యరూపం దాల్చాల్సి ఉంది.

చౌడేపల్లె: ఏమాత్రం వర్షం పడినా యనమసామనపల్లెలో రోడ్డు చెరువును తలపిస్తోంది. ప్రమాదభరితంగా తయారవుతోంది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డు మీద అడుగు లోతు నీళ్లు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. గుంతల లోతు తెలియక పోవటంతో ద్విచక్ర వాహనదారులు బోల్తాపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల కాలువలు లేక పోవటం, వర్షపునీరు వెళ్లడానికి మరో మార్గం లేక పోవటంతో తరచూ ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధకారులు స్పందించాలని వారు కోరుతున్నారు.



సోమల - నంజంపేట ప్రధాన మార్గ దుస్థితి ఇది



యనమసామనపల్లెలో చెరువులా రోడ్డు

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

అన్నదానానికి రూ.లక్ష విరాళం


జ్ఞాపిక అందిస్తున్న సూపరింటెండెంట్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 10: కాణిపాక ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి శనివారం కర్నూలుకు చెందిన హరిషోత్తమరెడ్డి రూ.1,11,116 విరాళంగా అందించారు. దాతను ఆలయ సూపరింటెండెంట్ వాసు ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

నేడు నగరి టైలర్ల అసోసియేషన్ సమావేశం

నగరి ఆగస్టు 10: నగరి మున్సిపాలిటీ పరిధిలోని విశ్వకోచింగ్ సెంటర్‌లో ఆదివారం టైలర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వీరయ్య తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాన్‌బాషా ముఖ్య అతిథిగా పాల్గొంటారని, టైలర్లందరూ హాజరుకావాలని కోరారు.

వైభవంగా రథోత్సవం



నగరి ఆగస్టు 10: నగరి మున్సిపాలిటీ పరిధిలోని చింతలపట్టెడ ద్రౌపదీ తిరునాళ్లలో భాగంగా శనివారం రథోత్సవం నిర్వహించారు. ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామిని పట్టువస్త్రాలు, పుష్పాలతో, బంగా రు ఆభరణాలతో అలంకరించి, రథంపై పురవీధులలో ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాన్ని నిర్వాహకులు నటరాజన్ పర్యవేక్షించారు.

కావళ్లతో తిరుత్తణికి..



శ్రీరంగరాజపురం, ఆగస్టు 10: మండలంలోని పెద్ద తయ్యూరు గ్రామంలో పలువురు భక్తులు కావళ్లతో తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయానికి వెళ్లారు. ఉదయం కావళ్లకు అభిషేకం, పూజలు చేసి పుష్పాలతో అలంకరించి ఆలయానికి తరలి వెళ్లారు.

ముగిసిన సర్పంచ్‌ల శిక్షణా తరగతులు

యాదమరి, ఆగస్టు 10: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులుగా ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. మండల విస్తరణాధికారి హరిప్రసాద్ పారిశుధ్యం, పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, ఎల్ఈడీ లైట్ల నిర్వహణ గురించి వారికి అవగాహన కల్పించారు. అబ్జర్వర్ ప్రసాద్, జిల్లా కో-ఆర్డినేటర్ షణ్ముగం, టీవోటీ సుందరేశన్ పాల్గొన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు

విజయపురం, ఆగస్టు 10: మండలంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కేవీపురం, మల్లారెడ్డికండ్రిగ, కళియంబాకం, పన్నూరు, మాధవరం, ఆలపాకం పంచాయతీల్లో రోడ్లు, వీధుల్లో చెత్తను తొలగించి, డ్రైనేజీలను శుభ్రపరిచారు. ఆవాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవోపీఆర్డీ బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుదర్శనరావు

పూతలపట్టు, ఆగస్టు 10 ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని వేము కళాశాల చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు కోరారు. శనివారం వేము ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆదర్శంగా ఉండాలని అన్నారు. వారు చదువుకోవడానికి అనుకూలమైన వాతావరణం కల్పించాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కిలారి, డాక్టర్ మణిలాల్, బీటెక్ హెచ్‌వోడీ శశికళ, డాక్టర్ సాయిశిరీష పాల్గొన్నారు.

కుష్ఠు అనుమానితులకు వైద్య పరీక్షలు



పాలసముద్రం, ఆగస్టు 10: మండలంలోని తిరుమలరాజుపురం, గంగమాంబాపురం, నరసింహాపురం, టీవీఎన్ఆర్‌పురం గ్రామాల్లో శనివారం అనుమానిత కుష్ఠు వ్యాధిగ్రస్తులకు డాక్టర్ మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులు, వీపుపై నొప్పిలేని బుడపలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, చల్లని, వేడి వస్తువులను గుర్తించకపోవడం కుష్ఠువ్యాధి లక్షణాలన్నారు. ప్రాథమిక దశలో మందులు ఉపయోగిస్తే వైకల్యాన్ని నివారించడానికి వీలవుతుందని పేర్కొన్నారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు శశికళ, సునీత పాల్గొన్నారు.

బాలుడికి జనసేన నేతల పరామర్శ

వెదురుకుప్పం, ఆగస్టు 10: మిద్దెపై నుంచి కాలు జారిపడిన బాలుడిని శనివారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పరామర్శించారు. కాపుమొండివెంగనపల్లెకు చెందిన బండి కృష్ణారెడ్డి, భారతి దంపతుల కుమారుడు బి.లోకేశ్‌రెడ్డి(14) ఇటీవల ఇంటి మిద్దెపై నుంచి పడి తిరుపతిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న యుగంధర్ అక్కడికెళ్లి పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని పార్టీ తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

కార్వేటినగరం సీఐకు సన్మానం



పాలసముద్రం, ఆగస్టు 10: కార్వేటినగరం సీఐగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్.హనుమంతప్పను శనివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు సన్మానించారు. అనంతరం సీఐ పాలసముద్రం పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. సరిహద్దు మండలం కావడంతో శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించాలని ఎస్ఐ భారతిని ఆదేశించారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

బంగారుపాళ్యం, ఆగస్టు 10: అక్రమంగా కర్ణాటక, ఆంధ్రా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని సదకుప్పం గ్రామానికి చెందిన మునిరత్నం, ధనుంజయ నాయుడు శనివారం కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వేపనపల్లికి చెందిన సుజాతను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద మద్యాన్ని స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన పోలీసులు



గుడిపాల, ఆగస్టు 10: చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలో రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షం కురిసినప్పుడల్లా మిట్టపల్లాలు తెలియక వాహనదారులు గాయాలపాలవుతున్నారు. కొందరు ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారు. గమనించిన ఇన్‌చార్జి ఎస్ఐ నరేంద్రకుమార్ పోలీసుల సహకారంతో గుంతలను పూడ్చి వేయించారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, ఆగస్టు 10: దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అలంకరించారు. క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజాది కార్యక్రమాలకు చుట్టుపక్కల గ్రామాల భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. ప్రధాన కార్యనిర్వాహకులు శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లక్ష్మీ నరసింహస్వామికి విశేష పూజలు

వెదురుకుప్పం, ఆగస్టు 10: చిన్నమరెడ్డికండ్రిగలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని తులసి దళములు, సుగంధభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు గిరి శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి మంజుల, సుబ్రహ్మణ్యం దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్య స్వామికి షష్టిపూజ

వెదురుకుప్పం, ఆగస్టు 10: కార్వేటినగరంలో వెలసిన సుబ్రహ్మణ్యంస్వామికి శనివారం షష్టి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆడి కృత్తిక ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి కావడి భక్తులు తరలి వచ్చి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా పుష్పపల్లకి ఉత్సవం



యాదమరి, ఆగస్టు 10: మండలంలోని కీనాటంపల్లె గ్రామంలో శనివారం ఎల్లమ్మ పుష్పపల్లకి, వసంతోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం అనంతరం ప్రత్యేక అలంకారంలో పుష్పపల్లకిలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి వసంతాలు సమర్పించి పూజలు చేశారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా రాఘవేంద్రరాజు



గంగాధరనెల్లూరు, ఆగస్టు 10: గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా రాఘవేంద్రరాజుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ మండలంలోనే ఈవోపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న భాస్కర్ రిలీవ్ అయ్యి నెల్లూరు జిల్లాకు వెళ్లారు.

వైసీపీ హయాంలో జరిగిన హత్యల మాటేమిటి? : టీడీపీ

గంగాధరనెల్లూరు, ఆగస్టు 10: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన హత్యలను పక్కనబెట్టి ఇప్పుడేదో జరిగిపోతోందని ఆ పార్టీ నాయకులు హడావుడి చేయడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ ఎస్సీ సెల్ చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దేవసుందరం విమర్శించారు. ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పినా వారికి కనువిప్పు కలగలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండునెలల కాకముందే రాష్ట్రంలో ఏదో జరిగిపోయిందని ఢిల్లీలో ధర్నా చేయడం ఎంతవరకు సబబు ఆలోచించుకోవా లన్నారు. దళిత వైద్యుడు సుధాకర్‌ను పిచ్చోడుగా చిత్రీకరించి చంపించింది నాడు వైసీపీ ప్రభుత్వం కాదా అని, సుబ్రమణ్యంను ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసినపుడు వైసీపీ నాయకుల గొంతు ఎందుకు మూగపోయిందని దేవసుందరం ప్రశ్నించారు. తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

తెరమరుగు

చిత్తూరులో దశాబ్దాల నాటి లక్ష్మీ టాకీస్ కూల్చివేత
థియేటర్‌తో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న నగరవాసులు


లక్ష్మీ టాకీస్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 10: నగర వాసులకు కొన్ని దశాబ్దాల పాటు వినోదాన్ని పంచింది లక్ష్మీ టాకీస్. సంస్కృతి సంప్రదాయ కళలకు పేరుగాంచిన రామవిలాస సభ ఆధ్వర్యంలోని ఈ థియేటర్‌లో ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, శోభన్‌బాబు, ఎంజీఆర్, శివాజిగణేశన్, కమలహాసన్, రజనీకాంత్ తదితర హీరోల చిత్రాలను చూసి ఆనందించారు. కొన్ని చిత్రాలు శతదినోత్సవాలు, రజోత్సవాలు జరుపుకున్నాయి. ఇంతటి చరిత్ర కలిగిన లక్ష్మీ టాకీస్‌ను కూల్చి వేస్తుండడంతో ప్రజలు అక్కడికి చేరుకుని దాంతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు. 30 సంవత్సరాలుగా రామవిలాస సభ యజమాన్యానికి, టాకీస్ లీజుదారుల మధ్య కోర్టులో కేసు నడుస్తుండటంతో టాకీస్ మూతపడింది. కోర్టులో రామవిలాస సభ యాజమాన్యానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. రామవిలాస సభ నూతన కమిటీ సభ్యులు టాకీస్‌ను కూల్చివేయాలని నిర్ణయించి, ఆ మేరకు పనులు ప్రారంభించారు. దాని స్థానంలో రంగనాథస్వామి ఆలయం, కల్యాణ మండపం నిర్మించాలని సంకల్పించారు.

వరసిద్ధుడి సేవలో నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్



నగరి ఆగస్టు 10: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శనివారం కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. ఆలయాధి కారులు ఆయనకు స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వచన మండపంలో ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ నేతలు స్వాగతం పలికారు.

అంగన్‌వాడీ హెల్పర్లకు నియామకపత్రాలు

నగరి డివిజన్ పరిధిలో ఇటీవల ఎంపికైన అంగన్‌వాడీ హెల్పర్లకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా స్థానికులు కొందరు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని ఫోన్ ద్వారా అధికారులను ఆదేశించారు.

సైబర్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

శ్రీరంగరాజపురం, ఆగస్టు 10: సైబర్ కాల్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మణికంఠ అన్నారు. ఆయన ఎస్ఆర్‌పురం పోలీస్ స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. పాత కేసుల రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సీజ్ చేసిన వాహనాలను త్వరగా క్లియర్ చేయాలన్నారు. తనపై కొందరు దాడి చేసి, వాహనాన్ని, సెల్‌ఫోను ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరినా పోలీసులు పట్టించుకోలేదని జీఎంఆర్‌పురం వడ్డిండ్ల గ్రామానికి చెందిన కృష్ణయ్య ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకోవాలని సీఐ, ఎస్ఐలను ఆదేశించారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ కుళాయిప్ప పాల్గొన్నారు.

సమాన పరిహారం అందించండి


కేశవపురంలో రీసర్వే చేస్తున్న అధికారులు

విజయపురం, ఆగస్టు 10: ఏపీఐఐసీ భూములకు సమాన పరిహారం అందించాలని మండలంలోని కేశవపురం ఆదిఆంధ్రవాడ వాసులు కోరారు. ఆదిఆంధ్రవాడలో 26 మంది భూములు కోల్పోతే 20 మంది వైసీపీ మద్దతుదారులకు రూ.8.43 లక్షల చొప్పున, ఆరుగురు టీడీపీ సానుభూతిపరులకు రూ.4.14 లక్షల చొప్పున మంజూరు చేశారని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆర్డీవో, జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడి అందరికీ సమాన పరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం పుత్తూరు హార్టికల్చర్ అధికారి లోకేష్, మండల సర్వేయర్ శేఖర్, సచివాలయ సర్వేయర్లు రీసర్వే ప్రారంభించారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామన్నారు.

కేసులను త్వరగా పరిష్కరించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

వెదురుకుప్పం, ఆగస్టు 10: కేసులు పెండింగ్‌లో లేకుండా త్వరగా పరిష్కరించాలని ఎస్పీ మణికంఠ పోలీసులను ఆదేశించారు. శనివారం కార్వేటినగరం పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కేసుల రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నా ‍రు. రాత్రి, పగలు బీట్ల పనితీరును నిరంతర మానిటరింగ్ చేస్తేనే నేరాలు తగ్గుతాయని చెప్పారు. పోలీసుస్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఆయన వెంట కార్వేటినగరం సీఐ ఎస్.హనుమంతప్ప ఉన్నారు.

బోర్డు ధ్వంసంపై వైసీపీ నిరసన

చిత్తూరు, ఆగస్టు 10: విజయవాడలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ మహాశిల్పం వద్ద బోర్డును ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ నేతలు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ప్రభుత్వ ప్రోద్బలంతోనే అంబేడ్కర్ విగ్రహంపై దాడి జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో గాయత్రీదేవి, కేపీ శ్రీధర్, మధురెడ్డి, రాసనపల్లి ప్రకాష్, నౌషద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 10: నగరంలోని గంగనపల్లె కన్నయ్య నాయుడు కాలనీ ఆరిపుల్లా షా చిష్టి ఖాదరి దర్గా 54వ ఉరుసు గంధోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఖాజీ కమాలు ల్లా ఆధ్వర్యంలో మత గురువులు అహమ్మదుల్లా, జమాల్ బాషాలు ప్రత్యేక ప్రార్థనలు చేసి, భక్తులను ఆశీర్వదిం చారు. అన్నదానం చేశారు. ప్రఖ్యాత గాయకులతో ఖవ్వా లి ఏర్పాటు చేశారు. నగరవాసులతో పాటు పరిసర మండలాల ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలసిన యుగంధర్



వెదురుకుప్పం, ఆగస్టు 10: రాష్ట్ర విద్యాశాఖ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి నారా లోకేశ్‌ను శనివారం అమరావతిలో కలసినట్లు జనసేన పార్టీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న తెలిపారు. నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా మార్చడానికి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

ఆదిమూలంను కలసిన టీడీపీ నేతలు



వెదురుకుప్పం, ఆగస్టు 10: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆది మూలంను శనివారం కార్వేటి నగరం టీడీపీ నేతలు కలిశారు. శాలువ కప్పి సత్కరించారు. తెలుగు యువత మండలాధ్యక్షుడు మురళీమోహన్, ఉపాధ్యక్షుడు సోమశేఖర్, నాయకులు ఎన్.పద్మనాభం, తిరుమల, రమేష్, రవితేజ ఉన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం : యూటీఎఫ్


చిత్తూరులో జెండా ఎగురవేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 10: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి ప్రతి ఉపాధ్యాయుడూ కలిసి రావాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ కోరారు. యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు పతాకాన్ని ఎగురవేశారు. రమణ మాట్లాడుతూ ఎందరో కార్యకర్తలు, నాయకులు, ఉద్యమకారుల కృషి, త్యాగాల ఫలితంగానే సంఘానికి ఈ మేరకు గుర్తింపు వచ్చిందన్నారు. నిర్బంధాలు, కేసులు, అరెస్టులు అధిగమించి సాధించిన విజయాల వెనుక ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యా రంగానికి తీవ్ర నష్టం కలుగజేస్తున్న జీవో 117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 53 జీవో ప్రకారం పని సర్దుబాటు చేపట్టాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు సుధాకర్, రెహనాబేగం, రెడ్డెప్ప, దక్షిణామూర్తి, బాషా, ఏకాంబరం పాల్గొన్నారు.

నగరి : నగరి పీసీఎన్ పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ జెండా ఎగురవేసి వందనం చేశారు. యూనియన్ నాయకులు జయశీలన్, వాసునాయుడు, జయరామయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

విజయపురం : విజయపురంలో యూటీఎఫ్ జెండా ఎగురవేసి, వందనం సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వంశీకృష్ణా, మండల ప్రధాన కార్యదర్శి రూబన్, ఉపాధ్యాయులు మునిచంద్రారెడ్డి, రవి, వాసుదేవవర్మ, హరిప్రసాద్, మణి, భాగ్యరాజ్, గోపి, పూర్ణచంద్ర, రామకృష్ణా, పరందామన్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఐరాల : ఐరాల ప్రాథమిక పాఠశాల వద్దనున్న ఎమ్మార్సీ భవనం వద్ద యూటీఎఫ్ జెండాను ఎగుర వేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు, మండలాధ్యక్షుడు సురేష్‌బాబు, జిల్లా కార్యదర్శి, ఏకాంబరం, ప్రభాకర్, అరుణ్‌కుమార్, దేవరాజులు, అమ్ములు, రామచంద్రనాయుడు, రామకృష్ణ, జనార్దన్, జగన్నాథనాయుడు, సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.